ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అనుమానాలొద్దు

- ఆన్‌టైమ్‌లో ఫీజులు చెల్లిస్తాం
- త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల
- విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎలాంటి అనుమానమూ అక్కర్లేదని, ఈ విద్యాసంవత్సరం నుంచి ఆన్‌టైమ్‌లో చెల్లించేందుకు ప్రయత్నిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ జెఎన్‌టియూలో శనివారం నిర్వహించిన 'క్వాలిటీ ఇంజినీరింగ్ ఎడ్యుకేషన్‌పై ఇంటరాక్షన్' కార్యక్రమంలో సిఎం మాట్లాడారు. రకరకాల పరిస్థితుల్లో ప్రాధాన్యతలు మారి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకు పోయాయన్నారు. పాత బకాయిలపై ఎలా ముందుకెళ్లాలనే అంశాన్ని పరిష్కరించే బాధ్యత మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగిస్తున్నట్టు ప్రకటించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై తమ ప్రభుత్వం త్రిముఖ వ్యూహంతో ముందుకెళ్తున్నట్టు తెలిపారు. ఇంజనీరింగ్ కాలేజీలు నిరుద్యోగులను ఉత్పత్తి చేసే కర్మాగారాలుగా మారకూడదని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి దేశ భవిష్యత్‌ను నిర్మించేలా ఉండాలని అన్నారు. ఇందుకు కావాల్సిన సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కేవలం ఉద్యోగాలను సృష్టించే సంస్థలుగా కాకుండా, దేశానికి మేధావులను అందించే సంస్థలుగా ఇంజనీరింగ్ సంస్థలు ఉండాలని ఆకాంక్షించారు. ఇంజనీరింగ్‌లో కేవలం కంప్యూటర్ సైన్స్‌పైనే కాకుండా, సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ లాంటి అన్ని రకాల కోర్సులనూ ప్రోత్సహించాలన్నారు. దేశం, ప్రపంచంలో గొప్ప నిర్మాణాలు, మానవ నిర్మిత అద్భుతాలన్నీ ఇంజనీర్లు ఆవిష్కరించినవే అన్నారు. ప్రపంచంతో పోటీపడేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ లో భాగంగా టాటా భాగస్వామ్యంతో రూ.2400 కోట్లతో ప్రభుత్వం ఐటిఐల రూపురేఖలు మారుస్తోందన్నారు. ఫార్మా, ఐటీ తర్వాత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని నడిపించబోతుందన్నారు. యువత కోసం త్వరలో స్కిల్‌డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు.

తమ ప్రభుత్వానికి భేషజాలు లేవని, నిరుద్యోగులకు మేలు జరిగేలా నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. నోటిఫికేషన్ల ప్రకారమే ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో ముందుకెళ్తుందన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయాలని నిరుద్యోగ యువత పదేండ్లు కొట్లాడిందని, ఇప్పుడు పరీక్షల వాయిదా కోసం కొన్ని రాజకీయ శక్తులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకుల కుట్రతో ఆమరణ దీక్షలు చేస్తున్నారన్నారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్‌ను తీసుకురాబోతున్నామని చెప్పారు. యుపిఎస్‌సి తరహాలో ప్రతి ఏటా క్యాలెండర్ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించారు. విద్యాసంస్థలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదనేదే తమ ప్రభుత్వ విధానం అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి 30 రోజుల్లోనే 30వేల ఉద్యోగాలు భర్తీ చేసామని, ఆర్థిక భారం, ఇతర సమస్యలు ఉన్నా.. ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకెళు(తు)న్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, డిజిపి జితేందర్, ఉన్నతవిద్యామండలి చైర్మన్ లింబాద్రి, పాల్గొన్నారు.



ఇంటరాక్షన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం

జెఎన్‌టియు పర్యటన నేపథ్యంలో అరెస్టులు

హైదరాబాద్ బ్యూరో : సిఎం రేవంత్‌రెడ్డి జెఎన్‌టియు పర్యటన నేపథ్యంలో శనివారం సిఐటియు నాయకులు, ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఆశాలు విధులకు వెళ్తుండగా వారు సిఎంను అడ్డుకుంటారేమోనన్న ఉద్దేశంతో పోలీసులు బాలానగర్‌లో అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులకు వ్యతిరేకంగా సిఐటియు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోశాధికారి ఉన్ని కృష్ణన్, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కల్యాణి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆశావర్కర్లు నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు. అరెస్టు చేసిన వారిని సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టులను సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండించాయి.

బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఆశాలు

లోగోను ఆవిష్కరిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

సెప్టెంబర్‌లో 'గ్లోబల్ ఎఐ సదస్సు'

- లోగోను ఆవిష్కరించిన సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మకమైన గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సదస్సును ఈ ఏడాది సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసిలో నిర్వహించనున్నట్టు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. శనివారం హైదరాబాద్‌లో ఐటి పరిశ్రమ శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సదస్సు లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. సాంకేతిక ఆవిష్కరణల రంగంలో మన రాష్ట్రాన్ని మరింత ముందంజలో ఉంచేందుకు ఈ సదస్సు దోహదపడుతుందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కృత్రిమ మేథా రంగ నిపుణులు, ఐటి ఆవిష్కర్తలందరినీ ఈ సందర్భంగా హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 'మేకింగ్ ఎఐ వర్క్ ఎవ్రీ వన్' అనే ఇతివృత్తంతో ఈ ఏడాది సదస్సును ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ సమాజానికి ఎలా ప్రయోజనం చేకూరుస్తుందో, ఎలా సాధికారత కల్పిస్తుందో అన్వేషించడమే లక్ష్యంగా ఈ సదస్సులో మేధోమథనం జరుగుతుందని చెప్పారు. దాదాపు రెండు వేల మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఎఐ పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, ప్రపంచంలో ఉన్న సవాళ్లను పరిష్కరించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ టెక్నాలజీ రంగంలో తెలంగాణలో కొత్త ప్రాజెక్టులకు ఈ సదస్సు నాంది పలుకనుందని పేర్కొన్నారు. సదస్సుకు సంబంధించిన అధికారిక వెబ్‌సైట్‌ను త్వరలోనే ప్రారంభించనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

గీతకార్మికులకు 'కాటమయ్య రక్ష' కిట్లు

- నేడు అబ్దుల్లాపూర్‌మెట్‌లో సిఎం శ్రీకారం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈదులు, తాళ్లు ఎక్కి కల్లుగీసే గీత కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని ప్రారంభించనుంది. 'కాటమయ్య రక్ష' పేర దీన్ని అమలుచేయనుంది. ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో సేఫ్టీ కిట్లను గీతకార్మికులకు అందించనుంది. ఈ కిట్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదివారం శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 11 గంటలు చేపట్టనున్నారు. గీతకార్మికులతో సమావేశం అనంతరం అక్కడే వారితో కలిసి సిఎం సహపంక్తి భోజనం చేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర బిసి కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గీతకార్మికులకు కాటమయ్య రక్ష కిట్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. చెట్టు ఎక్కి కల్లు గీసే క్రమంలో చాలాసార్లు ప్రమాదాల బారిన పడి గీత కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న విషయం విదితమే. ఈ ప్రమాదాలను నివారించేందుకు ఆధునికతను జోడించి సేఫ్టీ కిట్లను హైదరాబాద్ ఐఐటీతో కలిసి ఓ ప్రయివేటు సంస్థ రూపొందించింది. గీత కార్మికులు సులువుగా తాటి చెట్లను ఎక్కేలా ఈ కిట్లను తయారుచేశారు. ప్రమాదవశాత్తు తాటి చెట్ల మీద నుంచి కింద పడకుండా ఈ పరికరాల్లో అత్యాధునిక టెక్నాలజీని వినియోగించారు. ఒక్కో కిట్‌లో మొత్తం ఆరు పరికరాలు ఉంటాయి. క్లిప్పులు, హ్యాండిళ్లు, స్లింగ్ బ్యాగ్, లెగ్ లూప్ వంటివన్నీ వేర్వేరుగా ఉంటాయి. ప్రస్తుతం గీత కార్మికులు ఉపయోగిస్తున్న సాంప్రదాయ కిట్ల తరహాలోనే, యూజర్ ఫ్రెండ్లీగా ఉంటాయని శనివారం సిపిఆర్‌ఓ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

బాదంతో రోగనిరోధక శక్తి

- డాక్టర్ రోహిణి

హైదరాబాద్ : వర్షాకాలం తనతోపాటు సాధారణ జలుబు, జీర్ణ సమస్యలు, బలహీనమైన రోగ నిరోధక శక్తి వంటి అనేక ఆరోగ్య సవాళ్లను తీసుకువస్తుందని పోషకాహార నిపుణులు డాక్టర్ రోహిణి పాటిల్ పేర్కొన్నారు. ఈ కాలానుగుణ మార్పు సమయంలో బాదం, పసుపు, అల్లం, వెల్లుల్లి, బొప్పాయి, చిలకడదుంప తదితర వాటిలో పోషకాలు అధికంగా ఉండే సూపర్‌ఫుడ్‌లను అహారంలో చేర్చుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని బలోపేతం చేసుకోవచ్చని సూచించారు.

పెద్ద చెరువులో 16 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

హైదరాబాద్ బ్యూరో : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు బయ్యారం పెద్ద చెరువులోకి మసివాగు, పంది పంపుల వాగుల నుంచి భారీగా వరద నీరు చేరడంతో శనివారం బయ్యారం పెద్ద చెరువు నీటిమట్టం 16 అడుగులకు చేరుకుంది. ఇంకో అర అడుగు నీటి మట్టం పెరిగితే చెరువు మత్తడి పెద్ద చెరువుకు భారీగా వరద నీరు వస్తుండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఉదయం కల్లా బయ్యారం పెద్ద చెరువు మత్తడి పోసే ఉంది.

22న గద్వాలకు కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారక రామారావు ఈనెల 22న గద్వాల పర్యటనకు రానున్నారు. శనివారం హైదరాబాద్‌లో కెటిఆర్‌తో గట్టు మండలం సర్పంచ్ సంఘాల మాజీ అధ్యక్షులు, జిల్లా బిఆర్‌ఎస్ నాయకులు హనుమంతు నాయుడు భేటీ అయ్యారు. గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు. కెటిఆర్ మాట్లాడుతూ.. కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్నవారిని ఎవరినీ మరువబోమని చెప్పారు.

బిజెపిలో చేరటంలేదు

- ఎంపి వద్దిరాజు రవిచంద్ర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిజెపిలో చేరుతున్నట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని బిఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవి అభూత కల్పన వార్తలని పేర్కొన్నారు. టీవీ ఛానెళ్లు కొన్ని బిఆర్‌ఎస్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు, బలహీన పర్చేందుకు అదే పనిగా నిరాధారమైన, వాస్తవ విరుద్ధమైన కథనాలను ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. తాను కెసిఆర్ నాయకత్వంలోనే ఉంటానని స్పష్టం చేశారు.

కెటిపిపిలో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి

- నెల రోజులపాటు ఓవరాలింగ్ పనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రం (కెటిపిపి) మొదటి దశ 500 మెగావాట్ల ప్లాంట్‌లో శుక్రవారం రాత్రి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. జెన్‌కో అధికారుల ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం ప్రాజెక్టులో ఓవరాలింగ్ పనులు చేస్తారు. అధికారుల ఆదేశాలు రావడంతో 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి ఓవరాలింగ్ పనులు ప్రారంభించారు. దాదాపు నెల రోజులపాటు ఉత్పత్తి ఆగనుంది. ప్రాజెక్టులోని బాయిలర్, టర్బైన్, గ్రిడ్ విడిభాగాల యాడ్ ఫాంట్, వాటర్ ప్లాంట్ తదితర పనులను ఓవరాలింగ్ చేయనున్నారు.

కంటైనర్ ఆస్పత్రిని ప్రారంభించిన మంత్రి సీతక్క

ఏజెన్సీలో సీజనల్ వ్యాధులపై దృష్టి

- మంత్రి సీతక్క
- రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏజెన్సీ ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టితో ఐదు మారుమూల గ్రామాల కోసం రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రి (ఆరోగ్య ఉప కేంద్రం)ని ఏర్పాటు చేశామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తాడ్వాయి మండలం పోచాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కంటైనర్ ఆస్పత్రిని మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఈ మారుమూల ప్రాంతంలోని గుట్టలపై ఐదు గ్రామాల ప్రజలు నివసిస్తున్నారని, ఆరోగ్య సమస్యలు వస్తే అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే తొలి కంటైనర్ ఆస్పత్రిని ఏర్పాటు చేశామని తెలిపారు. నాలుగు పడకల కోసం సుమారు రూ.7 లక్షలతో దీన్ని రూపొందించామని, హైదరాబాద్ నుంచి ప్రత్యేక వాహనంలో తీసుకొచ్చి పోచాపూర్ గ్రామంలో పెట్టామని చెప్పారు. ఈ కంటైనర్ ఆస్పత్రిలో అత్యవసర చికిత్స నిమిత్తం నాలుగు బెడ్‌లు, మందులు ఏర్పాటు చేశామని, ఎఎన్‌ఎం, ఆశా కార్యకర్త విధులు నిర్వర్తిస్తారని అన్నారు. అనంతరం పోచాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఐదు గ్రామాల పరిధిలో కొంత మంది పోడు భూములకు పట్టాలు రాలేదని, పట్టాలు ఇవ్వాలని స్థానిక నాయకుడు మంకిడి ప్రశాంత్ మంత్రికి వివరించారు. కొడిశల పిహెచ్‌సిలో వైద్యులు ప్రతి రోజూ విధులకు హాజరయ్యేలా చూడాలని, గత ప్రభుత్వంలో రోడ్లు మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభించలేదని, వాటిని వెంటనే నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించి.. సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి సీతక్క పోచాపూర్‌లోని మినీ గురుకులాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, పిల్లలకు అందించే ఆహారంలో నాణ్యత పాటించాలని సూచించారు.

బుస్..బుస్
గురుకులాల్లో ఎలుకలు..ఇపుడు రెసిడెన్షియల్ పాఠశాలలో పాము

- ముగ్గురు విద్యార్థులకు కాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకులాల్లో ఎలుకలు కొరికిన ఘటన మరువక ముందే రెసిడెన్షియల్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు పాము కాటుకు గురయ్యారు. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌డిఓ కార్యాలయం వెనుక ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు మధ్యాహ్నం మూత్ర విసర్జనకు బయటకు వెళ్లారు. వారిలో ముగ్గురిని పాము కాటేసింది. జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ మెకానిక్ షాపులో పనిచేస్తున్న గోనపాడు గ్రామానికి చెందిన బాలుడు అనిల్ కుమార్, కేటి దొడ్డి మండలం తూర్పు తండాకు చెందిన సంతోష్ నాయక్, ఐజ మండలం తనగల గ్రామానికి చెందిన అర్జున్ కుమార్, గద్వాలకు చెందిన వీరేంద్రచార్యులను శుక్రవారం చైల్డ్ ప్రొటెక్షన్, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పట్టుకొని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో వదిలారు. ఈ నలుగురు విద్యార్థులు శనివారం మూత్ర విసర్జనకు వెళ్లారు. అక్కడ పాముకాటుకు గురి కావడంతో వెంటనే గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులు క్షేమంగానే ఉన్నట్టు వైద్యాధికారులు తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

పిఎల్ అక్వాపిఎంఎస్‌లో 76 శాతం రాబడి

హైదరాబాద్ : పిఎల్ అసెట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించిన అక్వా పిఎంఎస్ అత్యుత్తమ పని తీరును కనబర్చుతుందని ఆ సంస్థ తెలిపింది. ఏడాదిలో తమ ఈ ఎంఎఫ్ 76 శాతం రాబడిని అందించినట్లు క్వాంట్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజీస్ సి ఫండ్ మేనేజర్ హెడ్ సిద్దార్థ్ వోరా తెలిపారు. సరైన సమయంలో సరైన పెట్టుబడులు పెట్టడం ద్వారా నష్టాలను నియంత్రిస్తూ రాబడిని పెంచుకోవడమే అక్వా వ్యూహం లక్ష్యమన్నారు.

కొడుకే హత్య చేయించాడు !

- కమ్మరి కృష్ణ మర్డర్ కేసు ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రియల్టర్ కమ్మరి కృష్ణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. కృష్ణ కొడుకే తన చేతికి మట్టి అంటకుండా సుపారీ ఇచ్చి మరీ హత్య చేయించాడని నిర్ధారించారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో సంచలనం సృష్టించిన హత్యకేసు చిక్కుముడిని పోలీసులు ఛేదించారు. రియల్టర్ కమ్మరి కృష్ణను అతడి కుమారుడే హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించి నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడు మొదటి భార్య కుమారుడని పోలీసులు తెలిపారు. ఆస్తి మొత్తం మూడో భార్యకు రాసిస్తున్నాడనే కక్షతో ఈ దారుణానికి ఒడిగట్టాడని పేర్కొన్నారు. రూ.25 లక్షల సుపారీ ఇచ్చి ముగ్గురితో హత్య చేయించినట్లు వివరించారు. నిందితుల నుంచి మూడు కత్తులు, రెండు కార్లు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నామని శంషాబాద్ డిసిపి రాజేశ్ శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. కృష్ణ తన మొదటి భార్య, ఆమె పిల్లలను పట్టించుకోకుండా రెండో వివాహం చేసుకున్నాడు. ఆమె మృతి చెందిన తర్వాత మూడో వివాహం చేసుకున్నాడు. మూడో భార్య పావనికి 16 నెలలు కుమార్తె ఉంది. ఆమె పేరిట దాదాపు రూ.16 కోట్ల విలువచేసే ఆస్తిని కృష్ణ రిజిస్ట్రేషన్ చేశారు. తన తండ్రిని ఇలాగే వదిలేస్తే ఆస్తి మొత్తం పావనికే రాసి ఇస్తాడని ఉద్దేశంతో ఎలాగైనా కృష్ణను చంపాలని అతని కుమారుడు పథకం వేశాడు. కృష్ణ వద్ద పని చేసే అంగరక్షకుడు బాబా శివానంద్ అలియాస్ బాబాకు 25 లక్షలు, ఒక ఇల్లు ఇస్తానని ఆశ చూపాడు. ఇందుకు అంగీకరించిన బాబా శివానంద్ రూ. రెండు లక్షలు అడ్వాన్స్ తీసుకొని ఈ నెల 10 సాయంత్రం 5.30 గంటలకు బాబా, జీలకర్ర గణేష్ ఆలియాస్ లడ్డు, మైనర్ బాలుడితో కలిసి కమ్మదనంలోని కృష్ణ ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు.

జీలకర్ర గణేష్, మైనర్ బాలుడు ఇద్దరు కలిసి కమ్మరి కృష్ణ చేతులు వెనక్కి పట్టుకోగా... బాబా తనతో పాటు తెచ్చుకున్న కత్తితో గొంతు కోసి, పొట్టలో పొడిచి పరారయ్యారు. అతని అరుపులు విని పై అంతస్తులో ఉన్న భార్య వచ్చి కృష్ణను శంషాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ హత్యపై మృతుడు కమ్మరి కృష్ణ మూడో భార్య పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసి రెండు కార్లు, ఒక ద్వి చక్ర వాహనం, మూడు కత్తులు ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని డిసిపి రాజేష్ తెలిపారు. మృతుడు కృష్ణకు రూ.వంద కోట్లకుపైగా ఆస్తులున్నాయి. ఇతని మొదటి భార్యకు ఇద్దరు కుమారులున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బిసిలకు పెద్దపీట

- త్వరలో అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేల పెన్షన్
- బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- ప్రతి నియోజకవర్గంలో రూ.80 కోట్లతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు పెద్దపీట వేస్తుందని, త్వరలో అమర వీరుల కుటుంబాలకు రూ.25 వేల పింఛన్, 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని బస్సు డిపోలో నల్లగొండ-హైదరాబాద్‌కు ఎసి బస్సు, నాలుగు డీలక్స్ బస్సులు, పల్లెవెలుగు బస్సులను శనివారం ప్రారంభించారు. అనంతరం బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిసి భవన్ వద్ద ఏర్పాటు చేసిన మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల విగ్రహాలను రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం మాట్లాడుతూ.. మహిళలను తక్కువగా చూడటం.. మూఢనమ్మకాలు ఉన్న సమయంలోనే సావిత్రిబాయి పూలే మహిళల చదువు కోసం ఎంతో కృషి చేశారని, పాఠశాలలను స్థాపించారని చెప్పారు. సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరముందని తెలిపారు. బిసిల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం బిసి కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసిందన్నారు. అమరవీరుల కుటుంబాలకు 25వేల రూపాయల పెన్షన్ త్వరలోనే ప్రభుత్వం ఇవ్వనుందని, అదేవిధంగా 250 గజాల స్థలానికి సంబంధించి ఎంపిక కార్యక్రమం త్వరలోనే చేపట్టనున్నట్టు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారికి సహకారం అందించే విషయంపై మంత్రివర్గంలో చర్చించనున్నట్టు చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ రూ.80 కోట్లతో 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ నిర్మిస్తామని చెప్పారు. నల్లగొండ ఎస్‌ఎల్‌బిసి కాలనీ వద్ద ఈ హాస్టల్ నిర్మిస్తామని, చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మహాత్మ జ్యోతిరావుపూలే ఆశయాలు, ఆదర్శాలకనుగుణంగా అందరూ పని చేయాలన్నారు. జిల్లాలో బిసి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల సమస్యల పరిష్కారానికి, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం తన ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.కోటి 20 లక్షలు మంజూరు చేస్తామన్నారు. జాతీయ బిసి సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్, జిల్లా బీసీ సంఘం అధ్యక్షు చక్రధర్ రామరాజు తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ అబ్బాగోని రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మంత్రులు

జెన్‌కో ఎఇ పరీక్ష కేంద్రం మార్పు

- చివరి నిమిషంలో నిర్ణయం

హైదరాబాద్‌బ్యూరో : టిజిజెన్‌కో నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్స్ (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, కెమిస్ట్స్) ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సిబిటి) కేంద్రం చివరి నిముషంలో మారింది. ఆదివారం ఈ పరీక్ష ఉండగా, పరీక్షా కేంద్రాన్ని మారుస్తున్నట్టు టిజి జెన్‌కో యాజమాన్యం శనివారం సాయంత్రం పేర్కొంది. ఈ మేరకు అభ్యర్థులకు సమాచారం అందించినట్టు శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపింది. సాంకేతిక కారణాలతో కర్మన్‌ఘాట్ రోడ్డులోని కెపిఎమ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ (టిసి కోడ్-33905) సెంటర్‌ను మార్చారు. ఈ సెంటర్‌లో తొలి షిఫ్టులో ఉదయం 9 నుంచి 10.40 గంటల వరకు నిర్వహించే మెకానికల్, కెమిస్ట్ సిబిటిని, మూడో షిఫ్ట్‌లో సాయంత్రం 5 నుంచి 6.40 గంటల వరకు నిర్వహించే ఎలక్ట్రానిక్స్ అండ్ సివిల్ సిబిటిని సైదాబాద్ సంతోష్‌నగర్ వినయ్‌నగర్‌లోని భోజరెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ (టీసీ కోడ్-1732)కి మార్చినట్టు తెలిపారు. అలాగే కెపిఎమ్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ కేంద్రంలో రెండో షిఫ్టులో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.40 వరకు జరిగే ఎలక్ట్రికల్ సిబిటిని బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ విలేజ్‌లో ఉన్న ఎమ్‌విఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్ (టిసి కోడ్-2406) సెంటర్‌కు మార్చారు. తెల్లారితే పరీక్ష ఉందనగా, హఠాత్తుగా పరీక్షా కేంద్రం మార్పుపై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పరీక్షార్థులకూ సమస్యలు తప్పేలా లేవు. దానికి తోడు పరీక్షా కేంద్రాలను కొత్త సెంటర్లకు మారుస్తూ సంస్థ వెబ్‌సైట్‌లో హాల్‌టిక్కెట్లు ఉన్నాయనీ, అభ్యర్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షా కేంద్రాలకు వెళ్లాలని టీజీజెన్‌కో అభ్యర్థులు పరీక్షా కేంద్రం మార్పును గమనించి, సహకరించాలని ఆ సంస్థ కోరింది.

షాదాబ్ అలాం అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత్‌కు చెందిన నిరుద్యోగ యువతను ఉద్యోగం పేరుతో కాంబోడియాకు పంపించి మోసాలు చేయిస్తోన్న కీలక నిందితుడిని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీలో షాదాబ్ అలాంను అరెస్టు చేసిన పోలీసులు శనివారం హైదరాబాద్ నగరానికి తీసుకొచ్చి నాంపల్లి కోర్టులో హాజరుపర్చారు. కోర్టు 14 రోజులు రిమాండ్ విధించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు. సిరిసిల్లకు చెందిన బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సిరిసిల్ల పోలీసులు గతంలో ఏజెంట్ సాయిప్రసాద్, ఢిల్లీకి చెందిన మరో ఏజెంట్ అన్సారీని అరెస్టు చేశారు. దుబాయ్‌లో ఉండి చైనీయులకు సహకరిస్తున్న షాదాబ్ ఢిల్లీకి వచ్చినట్టు తెలుసుకుని అరెస్టు చేశారు. దుబాయ్‌లో ఉంటున్న షాదాబ్.. కాంబోడియా దేశంలో చైనీయుల కోసం పని చేస్తున్న దీపు అనే వ్యక్తికి ఏజెంటుగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. చాలా మంది యువతను కాంబోడియా పంపినట్టు గుర్తించారు. మే 16న సిరిసిల్ల పిఎస్‌లో నమోదైన ఈ కేసు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి బదిలీ అయింది.

జిఓ 10ని రద్దు చేయాలి

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'జిఓ నెంబర్ 10ని వెంటనే రద్దు చేయాలి. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ, విఆర్‌ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జిఓ ఇవ్వాలి. హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలి.24 రోజుల సమ్మె సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలి' అని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్‌అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె సునీత, పి జయలక్ష్మి, కోశాధికారి మంగ 20 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం గత ఏడాది 24 రోజులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేశామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే అంగన్వాడీ జెఏసి రాష్ట్ర నాయకత్వంతో బిఆర్‌ఎస్ ప్రభుత్వం చర్చలు జరిపి హెల్పర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, అంగన్వాడీ టీచర్లకు రూ. 2లక్షలు, హెల్పర్స్‌కు రూ. లక్ష ఆసరా పెన్షన్ చెల్లిస్తామనీ, 65 సంవత్సరాలలోపు రిటైరైన అంగన్వాడీ టీచర్స్, హెల్పర్లకు విఆర్‌ఎస్ వర్తింపజేస్తామనీ, తెలంగాణ రాష్ట్ర రెండో పిఆర్‌సిలో ప్రభుత్వోద్యోగులకు ప్రకటించిన ఐదు శాతం ఐఆర్‌ను వర్తింపజేస్తామనీ, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేస్తూ జిఓ ఇస్తామనీ, సమ్మెకాలపు వేతనాలు చెల్లిస్తామనీ తదితర డిమాండ్ల పరిష్కారానికి సంబంధిత మంత్రులు హామీ ఇచ్చారని తెలిపారు. దీంతో నాటి సమ్మెను విరమించినట్టు గుర్తు చేశారు. మంత్రులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐసిడిఎస్ మంత్రి, రాష్ట్ర అధికారులకు పలుసార్లు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. ఇప్పటివరకు మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కానీ..ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు. పైగా వారికి నష్టమొచ్చే విధానాలను అవలంభిస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మోడల్ స్కూళ్ల రెగ్యులర్ టీచర్లకు జీతాలు చెల్లించండి

- మాజీ మంత్రి హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒకటో తేదీనే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తున్నట్టు ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదనీ, ఆచరణలో మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీశ్‌రావు ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు ఏడు నెలల నుంచి ఏ నెల కూడా ఒకటో తేదీన వేతనాలు చెల్లించకపోవడం మోసపూరితం కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికే ఈనెలలో 13 రోజులు గడిచినప్పటికీ మోడల్ స్కూల్స్ రెగ్యులర్ టీచర్లకు జీతాలు అందకపోవటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నెల ఎనిమిదిన సగం మంది ఉద్యోగులకు మాత్రమే వేతనాలు చెల్లించిన సర్కారు, ఎనిమిది జిల్లాలో పని చేస్తున్న వెయ్యి మందికి ఇంకా వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. వీరితో పాటు మోడల్ స్కూళ్లలో పని చేసే అవుట్ సోర్సింగ్, హవర్లీ బేస్డ్ టీచర్లు (హెచ్‌బీటీ) దాదాపు రెండు వేల మందికి ప్రభుత్వం వేతనాలు చెల్లించలేదని తెలిపారు.

బదిలీ'లీల' రచ్చరచ్చ

- భారీగా పైరవీలు
- సాగునీటిశాఖలో అనర్హులకు పోస్టింగ్
- వైద్యారోగ్యశాఖలో గందరగోళం
- 40 శాతం ఉద్యోగుల్లో ఆందోళన
- టీచర్ల ట్రాన్స్‌ఫర్లు పూర్తి
- హెచ్‌ఒడిలకు చుక్కలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఆయా సర్కారీ శాఖల్లో సందడి కనిపిస్తున్నది. ఎలాగైనా పదోన్నతి సాధించాలని కొందరు, అనుకూలమైన ప్రాంతంలో పోస్టింగ్ తెచ్చుకోవాలని మరికొందరు పడరాని పాట్లు పడుతున్న పరిస్థితి. సిఎం రేవంత్ సర్కారు బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఇటీవల ఎత్తేయడంతో అన్ని ప్రభుత్వ శాఖల్లో అలజడి రేగింది. హెచ్‌ఒడిలు కసరత్తు ప్రారంభించారు. ఏ శాఖకు ఆ శాఖ బదిలీలపై ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశాయి. ఇప్పటికే ఆర్థిక, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధితోపాటు ఇతర శాఖలు ఉత్తర్వులు ఇచ్చుకున్నాయి. మొత్తంగా శాఖల్లో కేవలం 40 శాతం మంది ఉద్యోగులను మాత్రమే బదిలీ చేయాలని మార్గదర్శకాలు జారీ అయిన సంగతి తెలిసిందే. ఆయా శాఖల్లో కింది నుంచి పైదాక ఉన్న ఉద్యోగుల బదిలీలకు అర్హులను గుర్తించే బాధ్యతను ఆయా శాఖల హెచ్‌ఒడిలకు అప్పగించారు. ఆ మేరకు షెడ్యూల్ ఖరారు చేశారు. ఈ నెల 20 లోపు బదిలీలు చేపట్టనున్నారు. ఇప్పటికే విద్యాశాఖలో ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీ ప్రక్రియకు మరకలంటాయి. నిబంధనలకు విరుద్ధంగా వెబ్‌కౌన్సెలింగ్ జరిగిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హెచ్‌ఆర్‌ఎ ప్రాంతాలను బ్లాక్ చేసి అనుకూలమై వారికి ఇచ్చుకున్నారనే ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. రాష్ట్ర రాజధాని చుట్టూతా ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఈ తరహా వ్యవహారాలు అధికంగా జరిగాయంటూ ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 317 జిఓ సమస్యలు ఒకవైపు వేధిస్తుండగా, పైరవీలతో టీచర్లకు నష్టం జరిగిందనే విమర్శలు మరోవైపు వినిపిస్తున్నాయి. ఆ శాఖల్లో ఉద్యోగుల బదిలీలు ఇంకా చేయాల్సి ఉంది. సాగునీటి పారుదల శాఖలో అనర్హులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారనే ఆరోపణలు వస్తున్నాయి. నలుగురు చీఫ్ ఇంజనీర్లకు నిబంధనలకు విరుద్ధంగా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. వైద్యఆరోగ్యశాఖలో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల బదిలీల విషయంలో గందరగోళం నెలకొంది. సీనియార్టీ జాబితాను రూపొందించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంజనీరింగ్ శాఖల్లో వందలాది మంది ఇంజనీర్లు, ఉద్యోగుల, సిబ్బంది బదిలీల కోసం ఎదురుతెన్నులు పడుతున్నాయి. పంచాయతీరాజ్ శాఖలో ఇప్పటికే గుట్టుచప్పుకాకుండా కొంతమందికి ప్రమోషన్లు ఇచ్చినట్టు విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలమైన పోస్టింగులను తెచ్చుకునేందుకు అధికార పలుకుబడి కలిగిన కొందరు ఉద్యోగులు మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకుంటున్నారు. వాటిని హెచ్‌ఒడిలకు ఇచ్చి తమకు మంచి పోస్టింగ్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఈ తరహా లేఖలతో హెచ్‌ఒడిల తలబొప్పికడుతున్నట్టు సమాచారం. ప్రధానంగా ఇంజినీరింగ్ శాఖల్లో ఈ పరిస్థితి అధికంగా ఉంది. 40 శాతం బదిలీల జాబితాలో పేర్లు లేకపోతే ట్రాన్స్‌ఫర్లు చేయబోమనీ, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మాత్రమే ట్రాన్స్‌ఫర్లు చేస్తామని హెచ్‌ఒడిలు చెబుతున్నారు. శుక్రవారం సిఫారసు లేఖలతో మిషన్ భగీరథ హెచ్‌ఒడిపై తీవ్ర ఒత్తిళ్లు రాగా 'తాము ప్రభుత్వ జిఓ ప్రకారమే వ్యవహరిస్తామని' సదరు ఉన్నతాధికారి స్పష్టం చేశారు. బదిలీలకు ఎవరికైతే అర్హతలు ఉంటాయో, వారికే వర్తింపజేస్తాం..ఇందులో ఎవరికీ మినహాయింపులు ఉండవని పేర్కొన్నారు. మెడికల్ గ్రౌండ్స్‌పై బదిలీలను కోరుకునేవారికి సైతం గట్టిగా సమాధానం చెప్పారు. జిఓలో పేర్కొన్న నిబంధనల మేరకే బదిలీలలు చేస్తామని చెప్పారు. ఇదిలావుంటే రోడ్లు, భవనాల శాఖలో పరిస్థితి మరోలా ఉంది. సర్వీసు నిబంధనలు సరిగ్గా లేవని, తమకు న్యాయం చేయాలని ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని మొరపెట్టుకున్నారు. ప్రభుత్వ శాఖల్లో సర్వీసు నిబంధనలు సక్రమంగా లేకపోవడం, వీటిని అడ్డంపెట్టుకుని పైరవీల బ్యాచ్ ఇష్టానుసారం పోస్టింగ్‌లు తెచ్చుకోవడంతో ఒక్కో అధికారి నాలుగైదుసార్లు ఎక్స్‌టెన్షన్లు తెచ్చుకుంటూ ఆయా శాఖల్లో హవా నడిపిస్తున్నారు.

1,64,652 మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్

- నిరంతరం అందుబాటులో డిఎస్‌సి స్టేట్ సెల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిఎస్‌సి రాతపరీక్షలు షెడ్యూల్ ప్రకారమే ఈనెల 18 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి తెలిపారు. డిఎస్‌సికి 2,79,957 మంది దరఖాస్తు చేశారని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు 1,64,652 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. 14 మంది అభ్యర్థులు ఇచ్చిన ఆన్‌లైన్ డేటాలో సమాచారం సరిగా లేనందున వారికి పరీక్షా కేంద్రాలు దూరంగా కంప్యూటర్ సిస్టం ఇచ్చిందని తెలిపారు. అభ్యర్థుల సబ్జెక్టు, మీడియం వేరుగా ఉన్నందున ఈ వ్యత్యాసం వచ్చిందని పేర్కొన్నారు. ఈ లోపాన్ని వెంటనే గమనించి హాల్‌టికెట్లను సవరించి ఆ అభ్యర్థులకు డిఎస్‌సి స్టేట్ సెల్ ద్వారా ఫోన్ సమాచారం ఇచ్చామని వివరించారు. ఈ విధమైన లోపాల సవరణ, సమాచారం సూచనల కోసం పాఠశాల విద్యాశాఖ సంచాలకుల కార్యాలయంలో డిఎస్‌సి స్టేట్ సెల్ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ వివరాలు మీడియా, పాఠశాల విద్యాశాఖ వెబ్ పోర్టల్, ట్విట్టర్ ద్వారా ప్రకటించామని పేర్కొన్నారు. డిఎస్‌సి స్టేట్ సెల్ నెంబర్లు 9154114982, 6309998812 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాల కోసం www.schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.

పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న బిజెపి

- ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపణ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో పార్టీ ఫిరాయింపులను బిజెపి ప్రోత్సహిస్తున్నది ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గత పదేండ్లలో అనేక ప్రభుత్వాలను కూల్చిందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉత్తరాఖండ్ (2016), మణిపూర్ (2017), గోవా (2017), మేఘాలయ (2018), జమ్మూ అండ్ కాశ్మీర్ (2018), అరుణాచల్ ప్రదేశ్ (2019), కర్ణాటక (2019), మధ్యప్రదేశ్ (2020), పుదుచ్చేరి (2021), మహారాష్ట్ర (2022) ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదంతాలున్నాయని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాత్రం ఫిరాయింపులపై కాంగ్రెస్ పార్టీకి నీతులు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. నాలుగు రోజుల క్రితం మధ్యప్రదేశ్ మంత్రి వర్గంలోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేను తీసుకున్నారని గుర్తు చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్‌కు మధ్య పెద్ద తేడా లేదనీ, ఆ రెండు పార్టీల డిఎన్‌ఎ ఒక్కటేనని చెప్పారు. అక్కడ మోడీ, ఇక్కడ కెసిఆర్ కవల పిల్లలా బాగా కలిసిపోయారని ఎత్తిచూపారు. పార్టీ ఫిరాయింపులపై సుప్రీంకోర్టు కూడా బిజెపి సర్కారుకు చీవాట్లు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పార్టీ ఫిరాయింపుల విషయంలోబిజెపి, బిఆర్‌ఎస్‌ల డిఎన్‌ఎ ఒక్కటేనని చెప్పారు.

కాలేజీల్లో కేరళ మోడల్ 'మోరల్ పోలీసింగ్'

- విద్యార్థులకు కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాలి
- స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి

వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాలేజీల్లో కేరళ మోడల్ మోరల్ పోలీసింగ్ ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీనికి సంబంధించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. డ్రగ్స్‌ను సమూలంగా నిర్మూలించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని దానికి అందరూ సహకరించాలని సిఎం కోరారు. శనివారం హైదరాబాద్ జెఎన్‌టియులో నిర్వహించిన స్టూడెంట్ వాలంటరీ పోలీసింగ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ పాల్గొని మాట్లాడారు.

సమాజంలో ఉండే సమస్యలను మనమే గుర్తించి పరిష్కరించుకుంటే దుష్ఫలితాలను నివారించుకోవచ్చు అని చెప్పారు. సమాజంలో పెడధోరణులకు టెక్నాలజీ కూడా ఓ కారణంగా మారిందనీ, పిల్లలను మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచితే చాలా సమస్యలను నివారించవచ్చని తెలిపారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నం కావడమే చిన్నారుల మానసిక బలహీనతలను కారణంగా సిఎం పేర్కొన్నారు. చిన్నారుల మానసిక దృఢత్వానికి ఉమ్మడి కుటుంబం తోడ్పడుతుందన్నారు.

పిల్లలకు సోషల్ పోలీసింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. స్కూల్స్,కాలేజీల్లో సబ్జెక్టులతో పాటు మోరల్ పోలీసింగ్ కూడా నేర్పించాలని సూచించారు.

విద్యాసంస్థల్లో పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించే వ్యవస్థ ఉండాలన్నారు. పోలీసులకు సమాచారం చేరవేసేలా వ్యవస్థను తయారు చేసుకుంటే.. రాష్ట్రాన్ని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చవచ్చని చెప్పారు. డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేసి యుద్ధం ప్రకటించిందని గుర్తుచేశారు. మీ అన్నగా పిలుపునిస్తున్నా... డ్రగ్స్ నిర్మూలనకు సహకరించండి అని విద్యార్థులు, యువతను కోరారు.రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని నిర్ణయించిందనీ, ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. ప్రజాప్రతినిధి అనేది అత్యంత పవిత్రమైన బాధ్యత... ప్రజా సమస్యలపై ఫోకస్ గా పనిచేయడం వల్లే తాను ఈ స్థాయికి చేరానని తెలిపారు. సమస్యలకు భయపడి పారిపోవద్దు... నిలబడి పోరాడాలని సూచించారు.జీవితంలో ఫోకస్ గా పనిచేస్తే లక్ష్యాలను సాధించవచ్చన్నారు. నరేంద్రమోడీ, బిల్ గేట్స్ కైనా, రేవంత్ రెడ్డి...ఎవరికైనా రోజుకు 24 గంటల సమయమే ఉంటుందని, రోజుకు 16గంటలు మీరు ఎంత ఫోకస్‌గా పని చేస్తారో... అది లక్ష్యాన్ని అంత చేరువ చేస్తుందని సిఎం విద్యార్థులకు వివరించారు. గొప్ప వ్యక్తులు ఎవరూ గొప్ప కుటుంబాల నుంచి రాలేదనీ, ఎవరూ ఎవరికంటే తక్కువ కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, డిజిపి జితేందర్, పోలీసు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కెయు హాస్టల్‌లో పెచ్చులూడిన స్లాబ్

- అర్ధరాత్రి విద్యార్థినుల ఆందోళన
- మరో హాస్టల్‌కు తరలించాం: రిజిస్ట్రార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచాలపై పడిన స్లాబ్ పెచ్చులు

కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం అర్ధరాత్రి కలకలం రేగింది. పోతన మహిళా హాస్టల్లో స్లాబ్ పెచ్చులూడి విద్యార్థినుల మంచాలపై పడ్డాయి. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అర్ధరాత్రి విద్యార్థినులు రోడ్డెక్కి హాస్టల్ ఎదుట నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి హాస్టల్‌కు చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే, హాస్టల్‌లో నిత్యం సమస్యలతో ఇబ్బంది పడుతున్నామంటూ విద్యార్థినులు రిజిస్ట్రార్‌ను నిర్బంధించేందుకు యత్నించారు. శనివారం తెల్లవారే వరకూ విద్యార్థినుల నిరసన కొనసాగింది.

అధికారులు చర్యలు తీసుకోవాలి : విద్యార్థిని ఎం.పరిమళ

ఇటీవల ఫ్యాన్ ఊడిపడి విద్యార్థిని తలకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఇవాళ స్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. పోతన హాస్టల్‌లో 250 మంది అమ్మాయిలు ఉన్నారు. ఈ బిల్డింగ్ కట్టి సుమారు 35 సంవత్సరాల అవుతోంది. శిథిలావస్థలో ఉన్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు అడిగినా రిజిస్ట్రార్ మల్లారెడ్డి నుంచి స్పందన లేదు. ఇప్పటికైనా ఇన్‌చార్జి విసి వాకాటి కరుణ, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, ఇతర అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలి.

సమ్మక్క-సారక్క హాస్టల్‌కు విద్యార్థినులు : మల్లారెడ్డి, కెయు రిజిస్ట్రార్

పోతన హాస్టల్లో రాత్రి స్లాబ్ పెచ్చులూడి కింద పడటం ఆందోళనకరం. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం విద్యార్థినులను సమ్మక్క సారక్క హాస్టల్‌కు తరలించాం. 15 రోజుల కిందట జరిగిన ఫ్యాన్ ఘటనతోనే విద్యార్థినులను నూతనంగా ఏర్పాటు చేసిన సమ్మక్క సారలక్క హాస్టల్‌కు తరలించాలని నిర్ణయించి 250 బెడ్స్ తయారు చేసేందుకు ఆర్డర్ ఇచ్చాం. ఆ బెడ్స్ రావడానికి ఇంకా ఐదు రోజుల సమయం పడుతుంది. ఇలాంటి సంఘటనలు మళ్లీ జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటాం.

అన్వేషణ వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న సిధారెడ్డి, తదితరులు

పాఠకుని హృదయాన్ని తాకని రచన వ్యర్థం

ప్రజాశక్తి - కల్చరల్

కథ, కవిత, వ్యాసం, ఏ సాహితీ ప్రక్రియ అయినా పాఠకుని హృదయాన్ని తాకని రచన వ్యర్థం అని రాష్ట్ర సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి అన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో తెలంగాణ రచయితల సంఘం నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డాక్టర్ తూర్పు మల్లారెడ్డి రచించిన అన్వేషణ వ్యాస సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది ముఖ్య అతిథిగా నందిని సిధారెడ్డి పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి మనిషి జీవితంలో అన్వేషణ తప్పని సరిగా ఉంటుందన్నారు. పరిశోధన వ్యాసాలు రాసేవారు ఒక్క గ్రంథంపైనే దృష్టి పెడతారని, మల్లారెడ్డి మాత్రం పలు గ్రంథాలలోని అంశాలను గ్రహించి పాఠకునికి సమగ్ర సమాచారం అందిస్తారన్నారు. అభినందించారు. అధ్యక్షత వహించిన తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నళేశ్వరం శంకరం మాట్లాడుతూ.. మల్లారెడ్డి ప్రతి వ్యాసం పరిశోధన, పరిశీలనతో ఉందని అన్నారు. ఉత్తమ శ్రేణి విమర్శకుడు మల్లారెడ్డి అని అన్నారు సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీ వేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి తదితరులు మల్లారెడ్డి రచనా శైలినీ అభినందించారు. డాక్టర్ వి శంకర్ గ్రంథ సమీక్ష చేశారు. కందుకూరి శ్రీరాములు స్వాగతం పలికిన సభలో బి సంపత్ కుమార్ వందన సమర్పణ చేశారు.

విద్య సామాజిక జ్ఞానమివ్వాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - కల్చరల్

సామాజిక జ్ఞానం ఇచ్చేదే విద్య.. కాలానికి అనుగుణంగా నారాయణ గురు ఆధ్యాత్మిక విద్యను అందించే ప్రయత్నం చేశారని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సర్వమత సమ్మేళనం శతాబ్ది ఉత్సవాలకు ముఖ్య అతిథిగా వచ్చిన జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... సమాజంలో అంధవిశ్వాసాలు, కుల వివక్ష ప్రబలంగా ఉన్న సమయంలో కేరళలో సంఘ సంస్కరణ ఉద్యమాన్ని నారాయణ గురు ఆరంభించారు అని చెప్పారు. దశాబ్దాలు గడిచినా ఇంకా సామాజిక అంతరాలు తొలిగి పోలేదనీ ఇందుకు కారణం మనుషులలో ఆలోచన ధోరణి వ్యవస్తలో లోపాలు అన్నారు. సమాజాన్ని సంస్కరించటం చదువు లక్ష్యం కావాలని, దురదృష్టవశాత్తూ అది నేటి విద్యావిధానంలో లోపించిందని అన్నారు. నారాయణ గురు బోధనలు ప్రాచుర్యంలోకి తేవాల్సిన అవసరం వుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ ఈశ్వరయ్య, డాక్టర్ జయప్రకాష్ నారాయణ, పూర్వమంత్రి శ్రీనివాస్ గౌడ్, నారాయణ గురు ధర్మ ప్రచార సభ అధ్యక్షులు సాయిబాబా గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అరికపూడి గాంధీని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

బిఆర్‌ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఆ పార్టీ శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ శనివారం కాంగ్రెస్‌లో చేరారు. జూబ్లిహిల్స్‌లోని సిఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు అనుచరులు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో హస్తం పార్టీలో చేరిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 9కి చేరింది. ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. అరికెపూడి గాంధీతోపాటు పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, చందానగర్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస్.. సిఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. త్వరలో బిఆర్‌ఎస్ నుంచి మరికొన్ని వలసలు ఉంటాయని కాంగ్రెస్ సీనియర్లు చెబుతున్నారు.

క్రమశిక్షణ, నిజాయితీకి మారుపేరు రామలింగయ్య

- ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- చింతకాని మండలం కొదుమూరులో రామలింగయ్య సంస్మరణ సభ

సభలో మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోరాటాల యోధుడు, క్రమశిక్షణకు, నీతి నిజాయితీకి మారుపేరుగా నిలిచి జీవితాంతం పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు పోరాడిన వ్యక్తి మాదినేని రామలింగయ్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కొనియాడారు. ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని కొదుమూరులో సిపిఎం సీనియర్ నాయకులు మాదినేని రామలింగయ్య సంస్మరణ సభ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అధ్యక్షతన శనివారం జరిగింది. రామలింగయ్య చిత్రపటానికి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం సభలో తమ్మినేని మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు రామలింగయ్య జీవితాంతం అండగా ఉండి ప్రజా పోరాటాలు నిర్వహించారన్నారు. కొదుమూరు గ్రామంలో పార్టీ కోసం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నిబద్ధతగా నిలబడిన మహానుభావుడు అన్నారు. అనేక బెదిరింపులు వచ్చినప్పటికీ, భయపడకుండా పార్టీ అభివృద్ధి కోసం నికరంగా నిలబడి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. రామలింగయ్య తన ఇంటిని పార్టీ కార్యాలయంగా మార్చారని, కొదుమూరు సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో చుట్టుపక్కల గ్రామాల్లోనూ పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని చెప్పారు. రామలింగయ్య లాంటి వ్యక్తులు అరుదుగా ఉంటారని, అటువంటి వారిని ఆదర్శంగా తీసుకొని యువతీ, యువకులు ప్రజాపోరాటాల్లోకి రావాలని కోరారు. రామలింగయ్య కుమారుడు మాదినేని రమేష్ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నారన్నారు. రామలింగయ్య పెట్టుబడిదారీ సమాజంలో కూడా ఆదర్శవంత జీవితాన్ని గడిపారన్నారు.

విలువలకు ప్రాధాన్యతనిచ్చిన వ్యక్తి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి, పోతినేని

మాదినేని రామలింగయ్య విలువలకు అత్యధిక ప్రాధాన్యతమిచ్చిన వ్యక్తి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్ రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. పేద ప్రజలకు రామలింగయ్య ఎనలేని సేవ చేశారని కొనియాడారు. ఎర్రజెండా మార్గాన్ని ఎంచుకొని ఆ మార్గంలోనే చనిపోయే వరకు ఉన్నారన్నారు. కార్పొరేట్ రాజకీయాలకు భిన్నంగా కమ్యూనిస్టు రాజకీయాలు చేసిన యోధుడు రామలింగయ్య అన్నారు. ఆయన మార్గంలో మనమందరం నడవాలని పిలుపునిచ్చారు.

సభలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సాగర్, రాష్ట్ర నాయకులు చంద్రారెడ్డి, జంగారెడ్డి, సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భూక్య వీరభద్రం, బుగ్గవీటి సరళ, రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య, మన్నేపల్లి సుబ్బారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రామలింగయ్య కుమారుడు, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, సిపిఎం మండల కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, సిపిఐ జిల్లా నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, సిపిఎం నాయకులు వత్సవాయి జానకి రాములు, రాచబంటి రాము పాల్గొన్నారు.